తెగుళ్లతో జాగ్రత్త!

వరి, పత్తి, మొక్కజొన్న పంటలకు చీడపీడల ప్రమాదం

- సస్యరక్షణ చర్యలతోనే నివారణ
- మండల వ్యసాయాధికారి వెంకటేశం

షాబాద్‌: మండలంలో సాగు చేస్తున్న మొక్కజొన్న, పత్తి, వరిని ప్రస్తుతం వివిధ తెగుళ్లు ఆశిస్తున్నాయి. తగిన యాజమాన్య పద్ధతులు పాటించకుంటే ముప్పు తప్పదని వ్యవసాయ అధికారులు హెచ్చరిస్తున్నారు. మొక్కజొన్న, వరి, పత్తిలో తెగుళ్లు కనిపిస్తే వెంటనే నివారణ చర్యలు చేపట్టి పంటలను కాపాడుకోవాలని మండల వ్యసాయాధికారి వెంకటేశం రైతులకు సూచించారు. ప్రస్తుతం మొక్కజొన్న, వరి, పత్తిని ఆశించే తెగుళ్లు, వాటి నివారణ చర్యల గురించి ఆయన రైతులకు చేసిన సూచనలు.

వరిలో తెగుళ్లు, నివారణ చర్యలు..

ప్రస్తుతం వరికి అగ్గి తెగులు ఆశించే ప్రమాదముంది. తెగులు ఆనవాళ్లు కనిపిస్తే వెంటనే నివారణ చర్యలు చేపట్టాలి. ట్రై సైక్లోజోల్‌ 0.5 గ్రాములు లేదా ఇసోప్రొథయోలేన్‌ 0.5 మి.లీ లేదా కాసుగామైసిన్‌ 2.5 మి.లీ లీటర్‌ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. పిలకలు లేదా దుబ్బు చేసే దశలో ఉన్న వరి పంటలో కాండం తొలిచే పురుగు ఆశించే ప్రమాదముంది. దీని నివారణకు 10కిలోల కార్బోఫ్యూరాన్‌ 3జీ గుళికలు లేదా 4 కిలోల క్లోరాంట్రినిలిప్రోల్‌ 0.4జీ గుళికలను వేసుకోవాలి. వరిని బ్యాక్టీరియా ఎండు ఆకు తెగులు కూడా ఆశించే అవకాశముంది. దీని నివారణకు 30 గ్రాముల కాపర్‌, ఆక్సీక్లోరైడ్‌ 2 గ్రాముల ప్లాంటోమైసిన్‌ మందును లీటర్‌ నీటిలో కలిపి వారం వ్యవధిలో రెండుసార్లు పిచికారీ చేసుకోవాలి. అదే విధంగా వరిని ఉల్లికోడు ఆశిస్తే పురుగు ఉధృతిని ఎప్పటికప్పుడూ గమనించాలి. ఇప్పటికే అక్కడక్కడ తాటాకు తెగులు కనిపిస్తోంది. దీని నివారణకు 2 మి.లీ ప్రొఫెనోపాస్‌ లేదా 2.5 మి.లీ క్లోరోఫైరిపాస్‌ మందును లీటర్‌ నీటిలో కలిపి పిచికారీ చేయాలి. కొన్ని పంటల్లో ఆకుముడత కూడా కనిపిస్తోంది. దీని నివారణకు 2 గ్రాముల కార్టాప్‌ హైడ్రోక్లోరైడ్‌ లేదా 0.4 మి.లీ. క్లోరాంట్రినిలిప్రోల్‌ మందును లీటర్‌ నీటిలో కలిపి పంటపై పిచికారీ చేసుకోవాలి.



పత్తిలో తెగుళ్లు, నివారణ చర్యలు..

ప్రస్తుతం పత్తి పంటలో పేనుబంక ప్రభావం కనిపిస్తోంది. దీని నివారణకు 5.మి.లీ వేపనూనె, 0.25 మి.లీ ఇమిడాక్లోప్రిడ్‌ మందును లీటర్‌ నిటిలో కలిపి పంటపై పిచికారీ చేసుకోవాలి. తామర పురుగు, పచ్చదోమ ఆశిస్తే 2 మి.లీ ఫిప్రోనిల్‌ లేదా 0.3 గ్రాముల ఫ్లోనికామిడ్‌ లేదా 0.75 మి.లీ సల్ఫాక్సాఫ్లోర్‌ మందును లీటర్‌ నీటిలో కలిపి స్ప్రే చేయాలి. పండాకు తెగులు ఆశిస్తే మెగ్నీషియం ధాతులోపం నివారణకు 10 గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్‌ను లీటర్‌ నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలి. బ్యాక్టీరియా ఆకు మచ్చ తెగులు నివారణకు 3 గ్రాముల కాపర్‌ ఆక్సిక్లోరైడ్‌ లేదా ఒక గ్రాము కార్బండిజమ్‌ మందును లీటర్‌ నీటిలో కలిపి పిచికారీ చేసుకోవాలి. పత్తిలో అక్కడక్కడ గులాబీ రంగు పురుగు ప్రభావం ఉన్నట్లు తెలుస్తోంది. దీని ఉనికిని గమనించడానికి ఎకరాలకు 4 లింగాకర్షక బుట్టలు ఏర్పాటు చేసుకొని వరుసగా 3 రోజులు 7–8 తల్లి రెక్కల పురుగులు గమనించినట్లయితే సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. నివారణకు 1.5 గ్రాముల థయోడికార్బ్‌ లేదా 2 మి.లీ క్లోరోఫైరిపాస్‌ మందును లీటర్‌ నీటిలో కలిపి పంటపై పిచికారీ చేయాలని వ్యవసాయాధికారి సూచించారు.



బోడంపహాడ్‌లో రైతులు సాగు చేసిన పత్తి పంట



అంతారంలో మొక్కజొన్న పంట

వరద బాధితులకు అండగా నిలవాలి

ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌

షాద్‌నగర్‌: కేరళలోని వయనాడ్‌లో వరద బాధితులకు అందరూ అండగా నిలబడాలని ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ అన్నారు. గురువారం సీఐటీయూ ఆధ్వర్యంలో పట్టణంలోని వరద బాధితుల కోసం విరాళాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని ప్రారంభించిన అనంతరం ఆయన మాట్లాడుతూ.. కేరళలో వరదల బీభత్సంతో వయనాడ్‌ ప్రాంతం పూర్తిగా నీటిలో మునిగిపోయిందన్నారు. ప్రకృతి విపత్తు కారణంగా ప్రజలందరూ నిరాశ్రయులుగా మారారన్నారు. అక్కడి ప్రజలు ఆపన్నహస్తం కోసం ఎదురుచూస్తున్నారని, ప్రజలందరూ మానవతా దృక్పథంతో స్పందించి వరద బాధితులను ఆదుకునేందుకు తమవంతు సహాయ సహకారాలను అందించాలని సూచించారు. కార్యక్రమంలో నాయకులు చెంది తిరుపతిరెడ్డి, సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు రాజు, కొమ్ము కృష్ణ, జంగ నర్సింహా తదితరులు పాల్గొన్నారు.



విరాళాల సేకరణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

క్లుప్తంగా

చిన్నారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు



అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులకు ఆటలు నేర్పిస్తున్న టీచర్‌ లక్ష్మి

మొయినాబాద్‌రూరల్‌: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారుల అభివృద్ధికి ప్రత్యేక చర్యలు తీసుకోవాలని, ఆట, పాటలతో పాటు అక్షరాలను నేర్పించాలని మండల అంగన్‌వాడీ కేంద్రాల సూపర్‌వైజర్‌ శ్రీలక్ష్మి పేర్కొన్నారు. మండల పరిధిలోని హిమాయత్‌నగర్‌ గ్రామంలో గల అంగన్‌వాడీ–1,2 కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ–1లో టీచర్‌ లక్ష్మి విద్యార్థులకు నేర్పిస్తున్న ఆటలు, పాటలను తిలకించి మరింత అభివృద్ధి చేయాలని సూచించారు. ఆటలు, పాటలతో పాటు అక్షరాలను నేర్పించాలని పేర్కొన్నారు. గ్రామాల్లోని అంగన్‌వాడీ కేంద్రాల్లో ప్రభుత్వం అందిస్తున్న పౌష్టికాహారాన్ని పిల్లలకు, బాలింతలకు, గర్భిణులకు సక్రమంగా అందించాలని టీచర్లకు సూచించారు.

విద్యార్థులకు వాటర్‌ బాటిళ్లు అందజేత



బదిలీపైన వెళ్లిన ఉపాధ్యాయురాలితో విద్యార్థులు

కేశంపేట: మండల పరిధిలోని కొత్తపేట గ్రామంలో గల ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా విధులు నిర్వహించిన శ్రీలత రాజేంద్రనగర్‌కు బదిలీపైన వెళ్లారు. పాఠశాలలో విద్యార్థులకు తమవంతు సహకారం అందించాలనే ఉద్దేశంతో గురువారం రూ.14వేల విలువ కలిగిన స్టీల్‌ వాటర్‌ బాటిళ్లను ఆమె పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఎంపీడీఓ రవిచంద్రకుమార్‌రెడ్డి, మండల విద్యాధికారి మనోహర్‌, మండల వైద్యాధికారి డాక్టర్‌ నిఖిత, మండల పశువైద్యాధికారి డాక్టర్‌ నివేదిత, గెజిటెడ్‌ హెచ్‌ఎం చంద్రశేఖర్‌ పాల్గొన్నారు.

ఢిల్లీకి తరలిన ఫిషర్‌మెన్‌ నాయకులు



ధర్నాలో పాల్గొన్న ఫిషర్‌మెన్‌ జిల్లా చైర్మన్‌ మహేందర్‌ముదిరాజ్‌, తదితరులు

మొయినాబాద్‌రూరల్‌: ఆల్‌ ఇండియా ఫిషర్‌ మెన్‌ కాంగ్రెస్‌ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా ఢిల్లీలో నిర్వహించిన మత్స్యకారుల ధర్నాకు మండలం నుంచి పలువురు మత్స్యకారులు తరలివెళ్లారు. గురువారం న్యూఢిల్లీలో జరిగిన ధర్నాకు ఫిషర్‌మెన్‌ జిల్లా చైర్మన్‌ మహేందర్‌ముదిరాజ్‌తో పాటు ఆయా గ్రామాల నుంచి పలువురు నాయకులు తరలివెళ్లారు. ఢిల్లీలో జంతర్‌మంతర్‌ వద్ద ఏర్పాటు చేసిన ధర్నాలో బీజేపీ ప్రభుత్వం మత్స్యకారులకు వ్యతిరేకంగా చేసిన బిల్లులకు నిరసన తెలిపినట్లు తెలిపారు. ఈ ధర్నాలో పెద్దఎత్తున ఫిషర్‌మెన్‌ సంఘం సభ్యులు, నాయకులు పాల్గొన్నారన్నారు.

దంతాల రక్షణపై అవగాహన

మొయినాబాద్‌: మనిషి ఆరోగ్యంలో భాగంగా దంతాల రక్షణ ముఖ్యమేనని బాలాజీ దంత వైద్య కళాశాల వైద్యురాలు హరిత అన్నారు. గురువారం మొయినాబాద్‌ పోలీస్‌స్టేషన్‌లో దంతాల రక్షణపై అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. దంతాలను రక్షించుకోవడానికి తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. ఆహార పదార్థాలు తీసుకున్నప్పుడు చిన్న చిన్న ముక్కలు దంతాల మధ్య ఉండిపోయి కుళ్లిపోయే అవకాశం ఉంటుందని, తిన్న వెంటనే నోటిని నీళ్లతో శుభ్రం చేసుకోవాలన్నారు. దంతాలను శుభ్రం చేసుకోవడానికి మేలు చేసే బ్రెష్‌లను ఉపయోగించాలన్నారు. కార్యక్రమంలో డాక్టర్లు క్రాంతి, సల్మాన్‌ పర్వేజ్‌, నిఖిల్‌, జానీజాస్పర్‌, పోలీసులు పాల్గొన్నారు.

మొక్కలతోనే పర్యావరణ పరిరక్షణ

ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి

నందిగామ: పర్యావరణాన్ని కాపాడేందుకు ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటి సంరక్షించాలని మహబూబ్‌నగర్‌ ఎమ్మెల్సీ నాగర్‌కుంట నవీన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని మేకగూడ శివారులోని మైక్రోసాఫ్ట్‌ సంస్థ ఆవరణలో యూనైటెడ్‌ వే ఆఫ్‌ హైదరాబాద్‌, మైక్రోసాఫ్ట్‌ సంస్థ సంయుక్త ఆధ్వర్యంలో గురువారం వనమహోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎమ్మెల్సీ హాజరై మొక్కలు నాటారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చెట్లు, అడవి, పర్యావరణం రోజురోజుకు క్షీణించిపోతున్న ప్రస్తుత సమయంలో భావితరాల కోసం ప్రతిఒక్కరూ విధిగా మొక్కలు నాటాలని సూచించారు. ఇంటి ఆవరణ, గ్రామాలు, రోడ్లు, పార్కులు, వ్యవసాయ గట్లు, పరిశ్రమ ఆవరణలు, ఇలా ఖాళీ ప్రదేశాల్లో విరివిగా మొక్కలు నాటాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. నేడు మనం నాటిన మొక్కలే భావితరాల్లో మహావృక్షాలుగా మారుతాయన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్‌ మండల అధ్యక్షుడు పద్మారెడ్డి, మాజీ ఎంపీటీసీ రాజునాయక్‌, సంస్థ ప్రతి నిధి శ్రీచందన, కమిటీ అధికారి చంద్రకాంత్‌, సీనియర్‌ మేనేజర్‌ మధుమతి, మేనేజర్లు రాములు, సాయి కిరణ్‌, గ్రామస్తులు మల్లేశ్‌, నర్సింహా, యాదయ్య, రాజు, మోహన్‌నాయక్‌, మహిళా సంఘం సభ్యులు మంజుల, స్వప్న, శిరిష తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్సీ నవీన్‌రెడ్డి

కార్మికులను విస్మరిస్తున్న ప్రభుత్వం

సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్‌



చేవెళ్లలో నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు, నాయకులు

చేవెళ్ల: జీపీ కార్మికులను ప్రభుత్వం వెంటనే పర్మినెంట్‌ చేయాలని, ఎన్నికలు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని లేనిపక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామని సీఐటీయూ జిల్లా సహాయ కార్యదర్శి అల్లి దేవేందర్‌ అన్నారు. మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ యూనియన్‌ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు గురువారం కార్మికులు విధులు బహిష్కరించి నిరసన, ర్యాలీ నిర్వహించారు. ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ ర్యాలీ చేశారు. అనంతరం శంకర్‌పల్లి చౌరస్తాలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా దేవేందర్‌ మాట్లాడుతూ.. కాంగ్రెస్‌ పార్టీ నాయకులు కార్మికులకు ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్రంలో 12,769 పంచాయతీలలో 52 వేల మంది గ్రామ పంచాయతీ కార్మికులుగా పనిచేస్తున్నారని చెప్పారు. గతంలో 24 రోజులు సమ్మెచేస్తే కాంగ్రెస్‌ నాయకులు వచ్చి వారి వెంటే ఉంటామని కాంగ్రెస్‌ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన వెంటనే కార్మికులందరినీ పర్మినెంట్‌ చేస్తామని, ఉద్యోగ భద్రత కల్పిస్తామని కనీస వేతనాలు అమలు చేస్తామని హామీ ఇచ్చారని గుర్తుచేశారు. ఓట్లు వేయించుకొని అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్‌ ప్రభుత్వం కార్మికులను పట్టించుకోవడం లేదన్నారు. ఎన్నికలు ముందు ఇచ్చిన హామీని నిలబెట్టుకోకపోతే ఆందోళనలు ఉధృతం చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో సీఐటీ యూ మొయినాబాద్‌ మండల నాయకుడు ప్రభుదాస్‌, గ్రామ పంచాయతీ కార్మికుల యూనియన్‌ మండల అధ్యక్షుడు నర్సింహా, మొయినాబాద్‌ మండల అధ్యక్షుడు ఆంజనేయులుగౌడ్‌, షాబాద్‌ ఉపాధ్యక్షుడు టి.నర్సింహా, యాదయ్య, శంకర్‌పల్లి కార్యదర్శి సుజాత, నాలుగు మండలాలకు చెందిన నాయకులు, కార్మికులు పాల్గొన్నారు.

వేతనాలు అందకపోవడంతో ఇబ్బందులు

మధ్యాహ్న భోజన సమయంలో ఉపాధ్యాయుల నిరసన

చేవెళ్ల: మూడునెలలుగా తమకు వేతనాలు అందకపోడవడంతో తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మోడల్‌ స్కూల్‌ ఉపాధ్యాయులు ఆవేదన వ్యక్తం చేశారు. చేవెళ్లలోని మోడల్‌ స్కూల్‌లో గురువారం మధ్యాహ్న భోజన విరామ సమయంలో వేతనాలు అందించాలని కోరుతూ ఉపాధ్యాయులు నల్లబ్యాడ్జీలతో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. మోడల్‌ స్కూల్‌లో గత 11 ఏళ్లుగా పనిచేస్తున్నా ఎలాంటి బదిలీలు లేవన్నారు. ఒకేచోట ఇన్నేళ్లుగా పనిచేస్తున్న ఉపాధ్యాయులకు బదిలీలు కల్పించాలని కోరారు. రాష్ట్రంలోని ఎనిమిది జిల్లాలో మోడల్‌ స్కూల్‌ ఉపాధ్యాయులకు మూడునెలలు అవుతున్నా జీతాలు రాలేదన్నారు. ప్రభుత్వం ప్రతి నెల 1వ తేదీన జీతాలు చెల్లించాలని వారు డిమాండ్‌ చేశారు. ఔట్‌సోర్సింగ్‌ కింద పనిచేస్తున్న వారికి 5 నెలల నుంచి వేతనాలు అందడం లేదన్నారు. ప్రభుత్వం ఉపాధ్యాయుల వేతనాలను వెంటనే విడుదల చేయాలని కోరారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్‌ టేనావతి ఉపాధ్యాయులు సునీత, వంశీధర్‌రెడ్డి, లక్ష్మీప్రసాద్‌, రుక్మిణి, శ్రీదేవి, మల్లీశ్వరి, అనంత, యశోద, సుదీర్ఘ, అంజనేయులు, శ్రీనివాస్‌, శివ, రమేశ్‌ ఉన్నారు.



నల్లబ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

సీఎం సోదరుడికి శుభాకాంక్షలు

షాద్‌నగర్‌రూరల్‌: సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు ఎనుముల తిరుపతిరెడ్డి జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని గురువారం ఎమ్మెల్యే వీర్లపల్లి శంకర్‌ ఆయనకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా హైదరాబాద్‌లోని తిరుపతిరెడ్డి స్వగృహానికి షాద్‌నగర్‌ నుంచి ఎమ్మెల్యే ఆధ్వర్యంలో పెద్దఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివెళ్లారు. ఈ సందర్భంగా తిరుపతిరెడ్డికి పుష్పగుచ్ఛం అందజేసి, శాలువాలు కప్పి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమంలో చెంది తిరుపతిరెడ్డి, బస్వం, ముబారక్‌, ఖాదీర్‌, ప్రవీణ్‌, మహేశ్‌, జంగ నర్సింలు, కుమారస్వామిగౌడ్‌, బుచ్చన్న, పినమోని శ్రీనివాస్‌ పాల్గొన్నారు.

పేదల సంక్షేమానికి కృషి

షాబాద్‌: పేదల సంక్షేమానికి నిరంతరం కృషి చేస్తానని పీసీసీ ప్రధాన కార్యదర్శి ఎలుగంటి మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. గురువారం నగరంలో సీఎం రేవంత్‌రెడ్డి సోదరుడు తిరుపతిరెడ్డి పుట్టినరోజు సందర్భంగా ఆయనకు పుష్పగుచ్ఛం ఇచ్చి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద ప్రజల సంక్షేమానికి నిరంతరం తనవంతు కృషి చేస్తానన్నారు. నిరంతరం ప్రజల్లో ఉంటూ అభివృద్ధికి కృషి చేయడంలో ఉన్న ఆనందం ఎంతో గొప్పదన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్‌ పార్టీ మండల అధ్యక్షుడు కావలి చంద్రశేఖర్‌, నాయకులు కిషోర్‌నాయక్‌, ప్రశాంత్‌, సత్యం ఉన్నారు.



తిరుపతిరెడ్డిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే, నాయకులు

స్థానిక సంస్థల ఎన్నికల్లో సత్తాచాటాలి

బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజ్‌భూపాల్‌గౌడ్‌

షాద్‌నగర్‌: రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ నాయకులు, కార్యకర్తలు సత్తాచాటాలని బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు రాజ్‌భూపాల్‌గౌడ్‌ అన్నారు. గురువారం పట్టణంలోని పార్టీ కార్యాలయంలో కార్యకర్తల విస్తృతస్థాయి సమావేశాన్ని నిర్వహించారు. ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రాజ్‌భూపాల్‌గౌడ్‌, అందె బాబయ్య హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గ్రామస్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసేందుకు నాయకులు తగిన విధంగా కృషి చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను గుర్తించి వాటిని పరిష్కరించేందుకు తగిన విధంగా పనిచేయాలని సూచించారు. త్వరలో స్థానిక సంస్థల ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో పార్టీ కార్యకర్తలు నాయకులు సమష్టిగా ముందుకు సాగాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. ఈ సందర్భంగా మున్సిపాలిటీ ఓబీసీ మోర్చా అధ్యక్షులు, అదనపు ప్రధాన కార్యదర్శులను ఎన్నుకుని వారికి నియామక పత్రాలు అందజేశారు. కార్యక్రమంలో నాయకులు కమ్మరి భూపాలాచారి, ప్యాట అశోక్‌, భూషణ్‌పటేల్‌ వంశీకృష్ణ, మల్చాలం మురళీ, శేరివిష్ణువర్ధన్‌రెడ్డి, మఠం రుషికేశ్‌, శ్యాంసుందర్‌, శివాచారి, రాము, మధు, శ్రీహరి, విజయ్‌, శివ పాల్గొన్నారు.

బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శిగా శివశంకర్‌

షాద్‌నగర్‌రూరల్‌: బీజేపీ ఎస్సీ మోర్చా జిల్లా కార్యదర్శిగా సనుగోముల శివశంకర్‌ ఎన్నికయ్యారు. గురువారం నిర్వహించిన పార్టీ జిల్లా ఎస్సీ మోర్చా సమావేశంలో జిల్లా కార్యదర్శిగా శివశంకర్‌ను ఎన్నుకున్నారు. ఈ మేరకు ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు జ్ఞానేశ్వర్‌ ఉత్తర్వులు జారీచేసి ఆయనకు నియామకపత్రం అందజేశారు. కార్యక్రమంలో ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు ఎంకనోళ్ల వెంకటేశ్‌, నర్సింహా, పవన్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

వివాహానికి చేయూత



నిత్యావసర వస్తువులను అందిస్తున్న నాయకులు

కేశంపేట: మండల పరిధిలోని తొమ్మిదిరేకుల గ్రామంలో బత్తిన శేఖర్‌ వసంతల కూతురు అర్చన వివాహం నేడు జరుగనుంది. వీరిది నిరుపేద కుటుంబం కావడంతో పెళ్లి కోసం గ్రామానికి చెందిన కాంగ్రెస్‌ నాయకుడు కరుణాకర్‌రెడ్డి గురువారం బియ్యం, వంటనూనెతో పాటు వివిధ రకాల నిత్యావసర వస్తువులను అందించారు. కార్యక్రమంలో భీమయ్య, వెంకటేర్‌రెడ్డి, చంద్రయ్య, నర్సింహారెడ్డి, శేఖర్‌, రాఘవేందర్‌, శ్రీనివాస్‌రెడ్డి, నిరంజన్‌, శివయ్య, పాండు, కృష్ణ, సుభాన్‌రెడ్డి, నంద్యానాయక్‌ తదితరులు పాల్గొన్నారు.

సీసీరోడ్డు పనులు ప్రారంభం

కొత్తూరు: వార్డులో చేపట్టే పలు అభివృద్ధి పనులకు ప్రజలు, వ్యాపారులు సహకరించాలని 6వ వార్డు కౌన్సిలర్‌ వీరమోని హేమ దేవేందర్‌ముదిరాజ్‌ కోరారు. ఇందులో భాగంగా ఆమె గురువారం వార్డులో నూతనంగా నిర్మిస్తున్న సీసీరోడ్డు పనులను ప్రారంభించారు. కార్యక్రమంలో వార్డు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

సమాజంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకం



ఉపాధ్యాయుడిని సన్మానిస్తున్న మాజీ సర్పంచ్‌ శ్రీనివాస్‌గౌడ్‌, తదితరులు



కొందుర్గులో ఉపాధ్యాయులను సన్మానిస్తున్న ప్రజాప్రతినిధులు, ఉపాధ్యాయులు

షాబాద్‌: సమాజ నిర్మాణంలో ఉపాధ్యాయుల పాత్ర కీలకమని మక్తగూడ మాజీ సర్పంచ్‌ శ్రీనివాస్‌గౌడ్‌, ఉపసర్పంచ్‌ నారాయణరెడ్డి పేర్కొన్నారు. గురువారం మండల పరిధిలోని మక్తగూడ ప్రాథమిక పాఠశాలలో 13 ఏళ్లుగా పనిచేసి బదిలీపై నాగర్‌గూడ ప్రాథమిక పాఠశాలకు వెళ్తున్న ఉపాధ్యాయుడు కృష్ణను ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఉద్యోగులకు బదిలీలు సహజమని, ఎక్కడ ఉన్న పట్టుదలతో పనిచేస్తే సమాజంలో మంచి గుర్తింపు ఉంటుందన్నారు. కృష్ణ 13 ఏళ్ల పాటు విద్యాభివృద్ధికి తోడ్పాటును అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్‌ విజయలక్ష్మి, విద్యార్థులు, గ్రామస్తులు తదితరులు ఉన్నారు.

కొందుర్గులో..

కొందుర్గు: కొందుర్గు బాలికల ప్రాథమికోన్నత పాఠశాలలో పనిచేసి ఇటీవల బదిలీపై వెళ్లిన ఉపాధ్యాయులకు గురువారం పాఠశాల సిబ్బంది శాలువాలు, పూలమాలలతో ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం వెంకట్‌రెడ్డి, మాజీ వైస్‌ ఎంపీపీ రాజేశ్‌ పటేల్‌, నాయకులు సుధాకర్‌గౌడ్‌, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్మన్‌ అనిత, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

షాపుల్లో సీసీ కెమెరాలు తప్పనిసరి

ఇన్‌స్పెక్టర్‌ పవన్‌కుమార్‌రెడ్డి

మొయినాబాద్‌: బంగారం వ్యాపారులు అప్రమత్తంగా ఉండాలని, తమ షాపుల్లో సీసీకెమెరాలు తప్పనిసరిగా ఏర్పాటు చేసుకోవాలని ఇన్‌స్పెక్టర్‌ పవన్‌కుమార్‌రెడ్డి తెలిపారు. గురువారం మొయినాబాద్‌ పోలీస్‌స్టేషన్‌లో బంగారం వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బంగారం షాపుల్లో లోపల, బయట సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి అవి ప్రతిక్షణం పనిచేసే విధంగా చూడాలన్నారు. కెమెరాలను ఎప్పటికప్పుడూ పర్యవేక్షించాలని, షాపుల వద్ద వాచ్‌మెన్‌ను పెట్టాలని సూచించారు. పెట్రోలింగ్‌ చేసే పోలీసులు వాచ్‌మెన్‌ వద్ద ఉండే బుక్‌లో సంతకాలు చేసే అవకాశం ఉంటుందన్నారు. బంగారం తీసుకొచ్చే సమయాల్లో తగిన జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. బంగారం షాపులను లక్ష్యంగా చేసుకుని దొంగలు తెగబడుతున్నారని, సీసీ కెమరాలు ఉంటే వెంటనే గుర్తించే వీలుంటుందన్నారు. సమావేశంలో వ్యాపారులు కృష్ణమాచారి, భాస్కరాచారి, రాజు చారి, రాజేశ్‌, రమేశ్‌, సాగర్‌, సురేశ్‌, జగదీశ్వర్‌ తదితరులు పాల్గొన్నారు.



వ్యాపారులతో మాట్లాడుతున్న ఇన్‌స్పెక్టర్‌ పవన్‌కుమార్‌రెడ్డి

పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత

మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ విజయలక్ష్మి

శంకర్‌పల్లి: తమ ఇంటి పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ విజయలక్ష్మి అన్నారు. స్వచ్ఛదనం–పచ్చదనం కార్యక్రమంలో భాగంగా గురువారం పట్టణంలోని బాలికల ఉన్నత పాఠశాలలో డెంగీ, మలేరియా వ్యాధులపై వైద్యాధికారి, ఆశవర్కర్లతో కలిసి విద్యార్థులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా చైర్‌పర్సన్‌ మాట్లాడుతూ.. వర్షాకాలంలో వ్యాధులు ప్రబలే అవకాశం ఎక్కువగా ఉంటుందని, ఎల్లప్పుడూ పరిసరాలను శుభ్రంగా ఉంచుకోవడంతో దోమల వ్యాప్తిని అరికట్టవచ్చన్నారు. నీటి గుంతల్లో దోమలు వృద్ధి చెందకుండా ఆయిల్‌ బాల్స్‌, ఫాగింగ్‌ చేయిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కమిషనర్‌ శ్రీనివాస్‌, వైద్యాధికారి రేవతిరెడ్డి, వైస్‌చైర్మన్‌ వెంకట్‌రాంరెడ్డి, కౌన్సిలర్లు, కో–ఆప్షన్‌ సభ్యులు, పాఠశాల, మున్సిపల్‌ సిబ్బంది పాల్గొన్నారు.

కుక్కల బెడదను తగ్గిస్తాం

కొత్తూరు: మున్సిపాలిటీ పరిధిలోని అయా వార్డుల్లో నెలకొన్న వీధి కుక్కల బెడదను సాధ్యమైనంత త్వరగా తగ్గించడానికి కృషి చేస్తామని మున్సిపల్‌ చైర్‌పర్సన్‌ లావణ్య అన్నారు. గురువారం మున్సిపల్‌ అధికారులు, సిబ్బందితో కలిసి ఆమె అయా వార్డుల్లో పర్యటించారు. ఇళ్ల మధ్యలో, రోడ్లపై వర్షపు నీరు నిల్వ ఉండే ప్రాంతాలను గుర్తించి దోమలు వృద్ధి చెందకుండా రసాయనాలు, బ్లీచింగ్‌ పౌడర్‌ను చల్లాలని సిబ్బందికి సూచించారు. అంతేకాకుండా వార్డుల్లో నెలకొన్న సమస్యలను గుర్తించి సాధ్యమైనంత త్వరగా పరిష్కరించడానికి పాలకవర్గంతో కలిసి కృషిచేస్తానని పేర్కొన్నారు. కార్యక్రమంలో కమిషనర్‌ బాలాజీ, నాయకులు దేవందర్‌యాదవ్‌, కౌన్సిలర్లు తదితరులు పాల్గొన్నారు.



శంకర్‌పల్లిలో మాట్లాడుతున్న చైర్‌పర్సన్‌ విజయలక్ష్మి



కొత్తూరు: నిల్వ ఉన్న నీటిలో బ్లీచింగ్‌ పౌడర్‌ చల్లుతున్న చైర్‌పర్సన్‌ లావణ్య